సాక్షి తిరుపతి

ఆదివారం । 7 । జనవరి । 2024



వ్యవ'సాయానికి భరోసా'

అన్నదాతలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం క్షేత్రస్థాయిలో రైతు భరోసా కేంద్రాల ద్వారా సేవలందిస్తోంది. - IIలో



ఐఐటీ టెక్నాలజీతో రోడ్లు

తిరుపతిలో ఐఐటీ టెక్నాలజీ వినియోగించుకుని రోడ్లు నిర్మిస్తున్నట్లు డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి తెలిపారు. - IIలో



శ్రీకాళహస్తిలో స్మార్ట్ బజార్

శ్రీకాళహస్తిలో శనివారం స్మార్ట్ బజార్‌ను వైఎస్సార్‌సీపీ నేత బియ్యపు పవిత్రారెడ్డి ప్రారంభించారు. - IIలో

న్యూస్‌రీల్

శాస్త్రోక్తం.. తైలాభిషేకం



ప్రత్యేక అలంకారంలో శనీశ్వరస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామివారికి శనివారం శాస్త్రోక్తంగా తైలాభిషేకం నిర్వహించారు. నువ్వుల నూనె, మంచి నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో విశేషాభిషేకం జరిపించారు. అనంతరం వివిధ పుష్పాలతో స్వామిని అలంకరించి, ధూప దీప నైవేద్యం సమర్పించారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 2 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 57,441 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 20,878 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.66 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.


నేడు 'సాక్షి స్పెల్ బీ' సెమీఫైనల్స్

తిరుపతి ఎడ్యుకేషన్ : సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం తిరుచానూరు రోడ్డు, శ్రీనివాసపురంలోని హోలీ గ్రీన్ స్కూల్లో స్పెల్ బీ సెమీ ఫైనల్స్ నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి 10.30 గంటల వరకు కేటగిరి–1, 10.30 నుంచి 11 గంటల వరకు కేటగిరి–2, 11 నుంచి 11.30 గంటల వరకు కేటగిరి–3, 11.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కేటగిరి–4 విభాగంలో పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. స్పెల్ బీ పోటీలకు హాజరయ్యే విద్యార్థులు వారి స్కూల్ యూనిఫామ్ ధరించాలని, ఐడీ కార్డు, పెన్ను, పెన్సిల్, రైటింగ్ ప్యాడ్ తీసుకు రావాలని కోరారు.

తిరుమల నంబి చెంతకు శ్రీవారు

తిరుమల : శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు శనివారం సాయంత్రం సహస్రదీపాలంకార సేవ అనంతరం తిరుమలనంబి ఆలయానికి వేంచేపు చేశారు. ఏటా తన్నీరముదు ఉత్సవం మరుసటిరోజు ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా తిరుమలనంబివారికి మేల్‌చాట్ శేషవస్త్రం సమర్పించారు. శ్రీవైష్ణవ భక్తాగ్రేసరుడు, శ్రీవేంకటేశ్వరుని సేవలో జీవితాన్ని అర్పించిన మహనీయుడు తిరుమలనంబి. ఆయన సాక్షాత్తు శ్రీ భగవత్ రామానుజాచార్యులవారికి మేనమామ అని వేదపండితులు వివరించారు. కార్యక్రమంలో తిరుమల జియ్యంగార్లు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

తిరుమల వన్‌టౌన్ సీఐగా సత్యనారాయణ



తిరుమల : తిరుమల వన్‌టౌన్ సీఐగా సత్యనారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు వీఆర్ నుంచి ఆయన బదిలీపై వచ్చారు. సత్యనారాయణ మాట్లాడుతూ శ్రీవారి సన్నిధిలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు వెల్లడించారు. భక్తులకు తన వంతు సాయం అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.



నీకా.. నాకా?

పేరుకు సొంత జిల్లా అయినా చంద్రబాబుకు ఏనాడూ ప్రజల మద్దతు దక్కలేదు.. పొత్తుల పేరుతో ఇతర పార్టీలతో కలిసి వచ్చినా ఆశించిన ఫలితాలు రాలేదు.. అవకాశవాద రాజకీయాలతో గెలుపొందాలని యత్నించినా ప్రయోజనం చేకూరలేదు.. మళ్లీ పాత కథే పునరావృతమయ్యే పరిస్థితి కనిపిస్తుండడంతో టీడీపీ అధినేతకు దిక్కుతోచడం లేదు. అసలే బలమైన అభ్యర్థులు లేక ఆందోళన చెందుతున్న బాబుగారికి భవిష్యత్‌పై బెంగ పట్టుకుంది. ఎలాగైనా విజయావకాశాలు మెరుగుపరుచుకోవాలనే దురాలోచన చేస్తున్నట్లు తమ్ముళ్లే చెవులు కొరుక్కుంటున్నారు. చివరకు టీడీపీ.. జనసేన నేతల మధ్య చిచ్చుపెట్టి వేడుక చూస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ వర్సెస్ జనసేన

- బలమైన అభ్యర్థులు లేకపోయినా పోటాపోటీ
- తిరుపతి, చిత్తూరు, శ్రీకాళహస్తి సీట్లపై గందరగోళం
- రెండు పార్టీల నేతల మధ్య చిచ్చుపెట్టి వేడుక చూస్తున్న అధినేతలు
- హైప్ తెచ్చేందుకు ఉత్తుత్తి చేరికలతో హడావుడి
- కనిపించిన వారికి పచ్చ కండువాలు కప్పేస్తూ..
- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తమ పార్టీలో చేరుతున్నారంటూ విషప్రచారం

సాక్షి, తిరుపతి : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో సరైన అభ్యర్థులు లేకపోవడంతో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. చివరకు టీడీపీ, జనసేన పార్టీ నేతల మధ్య ఘర్షణ వాతావరణం కల్పిస్తున్నారు. కీలకమైన తిరుపతి, చిత్తూరు, శ్రీకాళహస్తి అసెంబ్లీ స్థానాల్లో చోటు చేసుకుంటున్న పరిణామాలే ఇందుకు నిదర్శనం. పొత్తులో భాగంగా పై మూడు స్థానాలను జనసేన కోరకుంటున్నట్లు జరుగుతున్న ప్రచారం తెలిసిందే. తన నైజానికి తగ్గట్టు చంద్రబాబు ఆయా స్థానాలను జనసేనకు కేటాయిస్తున్నట్లు హామీ ఇచ్చినా, వీటిని వదులు కోవడానికి సిద్ధంగా లేరు. ఎలాగైనా ఈ స్థానాల్లో కూడా తమ అభ్యర్థులనే బరిలోకి దింపాలని టీడీపీ అంతర్గత సమావేశంలో నిర్ణయించుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. అందులో భాగంగానే తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మకు జనసేన కండువా కప్పించి ఆ పార్టీ అభ్యర్థిగా బరిలోకి దింపేందుకు పావులు కదుపుతున్నారు. నేడో, రేపో చేరిక ఉండవచ్చని జోరుగా ప్రచారం సాగుతోంది. జన బలమే కాదు.. పార్టీ కమిటీలకు దిక్కులేని జనసేన

చిత్తూరులో బాబు చిచ్చు

చిత్తూరులో టీడీపీ జెండా మోసేవారు కరువైన సమయంలో మాజీ మేయర్ కఠారి హేమలత, మరి కొందరు టీడీపీ శ్రేణులు పార్టీ ఉనికిని కాపాడుకుంటూ వచ్చారు. ఈ పరిస్థితుల్లో అభ్యర్థిత్వం తమకే దక్కుతుందనుకున్న కఠారి హేమలత, బాలాజీ ఆశలపై చంద్రబాబు నీళ్లు చల్లేశారు. కొత్తగా జగన్‌మోహన్ అనే వ్యక్తిని రంగంలోకి దింపారు. కొంత కాలంగా జగన్‌మోహన్ చిత్తూరులోనే ఉంటూ ప్రజలకు రకరకాల బహుమతులు పంపిణీ చేస్తూ ఆకట్టుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. చిత్తూరు టికెట్‌పై ఆశలు పెట్టుకున్న జగన్‌మోహన్‌కు సైతం చంద్రబాబు హ్యాండిచ్చేశారు. తాజాగా డీకే ఆదికేశవులు నాయుడు బంధువులను రంగంలోకి తీసుకువచ్చేందుకు సన్నద్ధమవుతున్నారు. చాలా కాలంగా బెంగళూరుకే పరిమితమైన డీకే కుటుంబీకులు కొద్ది రోజులుగా చిత్తూరు, శ్రీకాళహస్తిలో టీడీపీ శ్రేణులతో మమేకమవుతున్నారు. ఈ క్రమంలోనే డీకే ఆదికేశవులు నాయుడు మనుమరాలు చైతన్యకు జనసేన కండువా కప్పించారు. శ్రీకాళహస్తి ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్, టీడీపీ దివంగత నేత గురవయ్య నాయుడుకు ఈమె కోడలు. అందుకే శ్రీకాళహస్తి నుంచి జనసేన అభ్యర్థిగా ఆమెను బరిలోకి దింపాలనే యోచనలో చంద్రబాబు ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ప్రస్తుతం నియోజక వర్గ టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న బొజ్జల సుధీర్‌రెడ్డి అభ్యర్థిగా పనికిరాడని స్థానిక టీడీపీ నేతలు కొందరు చంద్రబాబుకు వెల్లడించినట్లు సమాచారం. అవగాహన రాహిత్యం, అసభ్య పదజాలంతో సుధీర్ రెడ్డి మాట్లాడిన మాటలు, ప్రవర్తనపై బాబుకు వీడియోలు పంపినట్లు తెలుస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో బొజ్జల సుధీర్ అభ్యర్థిగా పనికి రాడనే అభిప్రాయానికి ఆ పార్టీ అధినేత వచ్చినట్లు తమ్ముళ్లు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఇక చిత్తూరు విషయానికి వస్తే.. డీకే ఆదికేశవులు నాయుడు కుటుంబంలోని వ్యక్తికే అభ్యర్థిత్వం ఇవ్వాలని భావించిన చంద్రబాబు.. తాజాగా మరో వ్యక్తికి ఫోన్‌చేసి టికెట్ ఆఫర్ చేసినట్లు తెలియడం గమనార్హం.

నాయకులమని చెప్పుకునే పసుపులేటి హరిప్రసాద్, కిరణ్ రాయల్ మాత్రం ఎవరికి వారు తామే అభ్యర్థులమని ప్రకటించుకుంటున్నారు. ఇరువురి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటున్నా పైకి మాత్రం భాయ్‌భాయ్ అని కలరింగ్ ఇచ్చుకు తిరుగుతున్నారు. చంద్రబాబు కుప్పం పర్యటనలో జరిగిన జనసేన నేతలతో పరిచయ కార్యక్రమంలో తలెత్తిన వివాదంపై పసుపులేటికి షోకాజ్ నోటీసు ఇవ్వడం వెనుక కిరణ్ రాయల్ హస్తం ఉన్నట్లు తెలిసింది. వీరి మధ్య కోల్డ్ వార్ నడుస్తుండగా.. మరికొందరికి సీటు ఇస్తామని చంద్రబాబు ఆఫర్ ఇచ్చినట్లు ముమ్మర ప్రచారం జరుగుతోంది.

భారంగా 'రా కదలిరా'

అభ్యర్థుల విషయమే తేల్చకుండా.. చంద్రబాబు 'రా కదలి రా' కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. సోషల్ మీడియా, పచ్చ పత్రికలు, ఎల్లో ఛానళ్లలో తప్ప టీడీపీ గురించి పట్టించుకోని జనంలో పార్టీకి హైప్ తెచ్చేందుకే ఎన్నికల ముందు ఈ కార్యక్రమాన్ని తెరపైకి తీసుకొచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. 'రా కదలిరా'ను అట్టహాసంగా చేపట్టాలని టీడీపీ నేతలకు చంద్రబాబు హుకుం జారీ చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో అది తలకు మించిన భారంగానే ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. చేసేది లేక ఎక్కడికక్కడ కార్యకర్తల సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. అధినేత ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ నుంచి తమ పార్టీలోకి పెద్ద సంఖ్యలో చేరికలు జరుగుతున్నాయని ప్రజలను నమ్మించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. గ్రామాల్లో కంటికి కనిపించిన వారిని పట్టుకువచ్చి పచ్చ కండువా కప్పేస్తున్నారు. వారందరూ వైఎస్సార్‌సీపీ నుంచి వలస వచ్చేస్తున్నారని కలరింగ్ ఇచ్చేస్తున్నారు. అందులో భాగంగానే శనివారం కుప్పం మండలం మల్లనూరు సమీపంలోని టి.సదుమూరు, హెచ్.కొట్టాల గ్రామాలకి చెందిన పలువురిని తీసుకెళ్లి టీడీపీ కండువాలు కప్పేసి ఫొటోలకు ఫోజులిప్పించేశారు. తమ్ముళ్ల అవస్థలు పసిగట్టిన ప్రజలు బాహాటంగానే నవ్వుకుంటుండడం కొసమెరుపు.



కుప్పం మండలంలో రెండు గ్రామాలకు చెందిన వారికి పచ్చ కండువాలు కప్పి ఫోజులిస్తున్న దృశ్యం

18 నుంచి జాతీయ స్థాయి వర్క్‌షాప్



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్ : సుస్థిర అభివృద్ధి.. లక్ష్యాల స్థానికీకరణ అనే అంశంపై ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు తిరుపతి శిల్పారామంలో జాతీయ స్థాయి వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో మాట్లాడారు. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి పలు రాష్ట్రాల మంత్రులు, అధికారులు, స్థానిక సంస్థల ప్రతినిధులు, ఇతర రంగాల ప్రముఖులు సుమారు వెయ్యిమంది హాజరుకానున్నట్లు వివరించారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి వర్క్‌షాప్‌ను విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సదస్సులో ఎలాంటి తప్పిదాలకు తావు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. అనంతరం పలు విభాగాలకు చెందిన అధికారులను 24 కమిటీలుగా ఏర్పాటు చేసి బాధ్యతలను అప్పగించారు. సమావేశంలో జేసీ శుభం బన్సల్, డీఆర్‌ఓ పెంచల కిషోర్, ఆర్డీఓ నిషాంత్ రెడ్డి, డీపీఓ రాజశేఖర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి పాల్గొన్నారు.

సాహిత్యంపై అవగాహన అవసరం



సత్కారం అందుకున్న అవధాని, ఉపాధ్యాయులు

నారాయణవనం : తెలుగు సాహిత్యంపై విద్యార్థులకు అవగాహన అవసరమని శతావధాని ఉప్పలదడియం భరత్‌శర్మ తెలిపారు. శనివారం మండలంలోని పాలమంగళం ఉన్నత పాఠశాలలో పూర్వవిద్యార్థులు అష్టావధానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భరత్ శర్మ తెలుగు సాహిత్యంపై పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులు సంధించిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. అనంతరం అవధానితో పాటు తెలుగు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మనోహరి తదితరులు పాల్గొన్నారు.

అతివలదే ఆధిపత్యం!

- జిల్లాలోని మొత్తం ఓటర్లు 17.76 లక్షలు
- అందులో మహిళలే అధికం
- 21వ తేదీన తుది జాబితా విడుదల



జిల్లా సమాచారం

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్లు	మొత్తం
గూడూరు	1,18,263	1,23,410	43	2,41,716
సూళ్లూరుపేట	1,15,216	1,20,878	38	2,36,132
వెంకటగిరి	1,15,389	1,20,683	04	2,36,076
చంద్రగిరి	1,46,872	1,54,009	59	3,00,940
తిరుపతి	1,46,697	1,47,612	45	2,94,354
శ్రీకాళహస్తి	1,18,183	1,24,978	18	2,43,179
సత్యవేడు	1,01,578	1,07,339	14	2,08,931

తిరుపతి అర్బన్ : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో మహిళల పాత్ర కీలకంగా మారనుంది. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో మొత్తం ఓటర్లు 17,76,926 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారిక సమాచారం. అందులో ప్రధానంగా మహిళలు అధిక సంఖ్యలో ఉండటం గమనార్హం. 8,92,198 మంది మహిళా ఓటర్లు, 8,62,198మంది పురుష ఓటర్లు ఉన్నారు. నూతనంగా ఓటు హక్కు పొందిన యువత 12,107 మంది, 80ఏళ్లు దాటిన వయోవృద్ధులు 26,261మంది ఉన్నారు. ఈ నెల 21వ తేదీన ఓటరు తుది జాబితా విడుదల కానుంది. 18 ఏళ్లు నిండిన వారికి ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. సార్వత్రిక ఎన్నికలు నిర్వహించే రెండు రోజుల ముందు వరకు నూతనంగా ఓటు హక్కు పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఇచ్చింది. ఆ మేరకు రెవెన్యూ, ఈఆర్‌ఓలు, బీఎల్‌ఓలకు ఆదేశాలు జారీ చేసింది.

తొలిసారి ఓటు



నాకు 18 ఏళ్లు నిండాయి. ఈసారి కొత్తగా ఓటు హక్కు వచ్చింది. రాబోయే సార్వత్రిక ఎన్నికలలో తొలిసారి ఓటు హక్కును వినియోగించుకోబోతున్నా. చాలా ఉత్సాహంగా ఉంది. ఓటు ఎలా వేయాలో మా సచివాలయ పరిధిలో ఈవీఎం మిషన్ ద్వారా అవగాహన కల్పించారు. యువతకు మంచి భవిష్యత్‌ను అందించే నాయకుడికి ఓటు వేయబోతున్నా.

– పద్మప్రియ, పాపానాయుడుపేట, ఏర్పేడు మండలం

ఆరు దశాబ్దాలుగా ఓటేస్తున్నా



సుమారు ఆరు దశాబ్దాలుగా ఓటు హక్కు వినియోగించుకుంటున్నా. ప్రజలకు మంచి చేసే వారికే ఈ పర్యాయం ఓటేస్తా. నా హక్కును జాగ్రత్తగా వాడుకుంటా. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా సమర్థుడైన అభ్యర్థినే మా ప్రతినిధిగా ఎన్నుకుంటా. ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటు హక్కు వినియోగించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– రామచంద్ర, ముడియూర్, పిచ్చాటూరు మండలం

పారదర్శకంగా జాబితా



జిల్లాలో ఓటరు జాబితాను పారదర్శకంగా తయారు చేశాం. ప్రతి నియోజకవర్గంలో అన్ని పార్టీల ప్రతినిధులను సంప్రదించి వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకున్నాం. త్వరలో తుది జాబితాను ప్రకటించనున్నాం. ఓటింగ్‌కు రెండు రోజుల ముందు వరకు కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ ఆన్‌లైన్‌లో కొనసాగుతుంది. ఈ అవకాశాన్ని అర్హులైన యువత వినియోగించుకోవాలి.

– వెంకటరమణారెడ్డి, కలెక్టర్, తిరుపతి

సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

- సాధారణ చార్జీలే వసూలు
- ప్రధాన నగరాలకు 233 సర్వీసులు

తిరుపతి అర్బన్: సంక్రాంతి సందర్భంగా తిరుపతి నగరం నుంచి వివిధ ప్రాంతాలకు సాధారణ చార్జీలతో ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు జిల్లా ప్రజారవాణా అధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ తిరుపతి నుంచి బెంగళూరుకు 82, చెన్నైకి 28, హైదరాబాద్‌కు 31, విజయవాడకు19, ఇతర ముఖ్యమైన మార్గాలకు 65 ఆర్టీసీ సర్వీసులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడుస్తాయని చెప్పారు. రిజర్వేషన్ సౌకర్యం ఉందని చెప్పారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఆర్టీసీ ఆన్‌లైన్.ఇన్ వెబ్‌సైట్‌లో రిజర్వేషన్ చేసుకునే సౌకర్యం ఉందని తెలిపారు. అంతేకాకుండా బస్టాండ్‌లోని రిజర్వేషన్ కౌంటర్‌లోనూ రిజర్వేషన్ చేసుకునే సౌకర్యం ఉందని చెప్పారు. ఏటీబీ ఏజెంట్ల వద్ద రిజర్వేషన్ చేసుకోవడానికి వీలు కల్పించామని వివరించారు.

క్లుప్తంగా

శ్రీకాళహస్తిలో స్మార్ట్ బజార్



జ్యోతి ప్రజల్వన చేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన స్మార్ట్ బజార్‌ను శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రా రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆమె మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో స్మార్ట్ బజార్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు అందుబాటులో ధరలు ఉండేలా చూడాలని నిర్వాహకులకు సూచించారు. మార్టు యజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆలయ కమిటీ సభ్యులు సుమతి, స్థానిక నేతలు శివయాదవ్, ప్రమీల, షర్మిలాఠాగూర్, మాధవి, టైలర్ శీను, ముద్దమూడి రవి ప్రమీల నాయుడు పాల్గొన్నారు.

పాదిరేడులో మరో 1,703 మందికి ఇళ్ల పట్టాలు



డిప్ కార్యక్రమంలో టీటీడీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్, ఉద్యోగులు

తిరుపతి(అలిపిరి): వడమాలపేట మండలం పాదిరేడు వద్ద రెండో విడతలో మరో 1,703 మంది టీటీడీ ఉద్యోగులకు 132 ఎకరాల్లో ఇళ్ల పట్టాలు పంపిణీ చేయనున్నట్లు టీటీడీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ తెలిపారు. శనివారం స్థానిక శ్వేత భవనంలో రెండో విడత ఉద్యోగుల ఇంటి స్థలాల కోసం లక్కీ డిప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన మహతి ఆడిటోరియంలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి చేతుల మీదుగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తారని చెప్పారు. అర్హులైన టీటీడీ ఉద్యోగులందరికీ ఇళ్ల పట్టాలు అందుతాయన్నారు. త్వరలోనే ఏర్పేడు సమీపంలో మిగిలిన వారికి పట్టాల పంపిణీ జరుగుతుందన్నారు. అనంతరం డిప్ నిర్వహించి టీటీడీ ఎంప్లాయిస్ బ్యాంకు, టీటీఈ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున ప్లాట్లు పొందిన 1,703 మంది ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు.



నారాయణవనం మండలం అరణ్యకండ్రిగలో ఏర్పాటు చేసిన ఆర్‌బీకే



సంతవేలూరులో సబ్సిడీపై ట్రాక్టర్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం (ఫైల్)

నవశకం
వ్యవసాయానికి భరోసా

వ్యవసాయం దండగ.. అంటూ తెలుగుదేశం ప్రభుత్వం రైతాంగాన్ని అధోగతి పాలు చేస్తే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాగుకు పెద్దపీట వేసి రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో పలు సేవలను రైతుల ముంగిటకే తెచ్చి వ్యవసాయాన్ని పండుగలా మార్చింది. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పలు సంక్షేమ పథకాలు చేపట్టింది. అందులో భాగంగా గ్రామస్థాయిలో ఏర్పాటైన రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులతో పాటు భూసార పరీక్షలు, వ్యవసాయ పరికరాలు, పంటల సాగులో అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తున్నారు. గ్రామస్థాయిలోనే ఇవన్నీ అందుతుండడంతో రైతులు ఉత్సాహంగా పొలంబాట పడుతున్నారు.

- అన్నదాతకు అండగా నిలుస్తున్న ప్రభుత్వం
- సాగును సంబరంగా మార్చిన సంక్షేమం
- సేవలందిస్తున్న రైతు భరోసా కేంద్రాలు

వరదయ్యపాళెం: ఒకప్పుడు వ్యవసాయం చేయాలంటే ప్రతి పనికీ మండల కేంద్రాలు, అధికారులు చుట్టూ ప్రదక్షిణం చేయాల్సి వచ్చేది. రోజుల తరబడి తిరిగి చివరకు వ్యవసాయం చేయలేమనే ఆవేదన వ్యక్తం చేసిన రోజుల నుంచి నేడు వ్యవసాయమంటే పండుగ అనే పరిస్థితులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారు. ప్రతి సచివాలయం పరిధిలో ఒక రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేశారు. తద్వారా విత్తనాలు, కొనుగోళ్ల నుంచి రైతులు పండించిన ధాన్యం విక్రయించే వరకు ఎరువుల కొనుగోలు, వ్యవసాయానికి కావల్సిన యంత్ర పరికరాలన్నీ ఆర్బీకేల దగ్గరే అందుబాటులో ఉన్నాయి. రైతులు పండించిన పంటలకు ఈ–క్రాప్ బుకింగ్ చేసి ప్రకృతి వైపరీత్యాల వలన నష్టపోయిన పంటలకు పరిహారం, రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించడం, పొలంబడి ద్వారా రైతులకు శిక్షణ, ట్రోల్ ఫ్రీ నెంబరు 155251 ద్వారా రైతులకు నేరుగా ముఖాముఖితో శాస్త్రవేత్తల సలహాలు అందించేందుకు రైతు భరోసా కేంద్రాలు దోహదపడుతున్నాయి. ఆ మేరకు సత్యవేడు నియోజకవర్గంలోని వరదయ్యపాళెం, సత్యవేడు, నాగలాపురం, పిచ్చాటూరు, నారాయణవనం, కేవీబీపురం, బీఎన్‌కండ్రిగ మండలాల్లో రైతుల అవసరాల కోసం 87 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. తద్వారా 31738 మంది రైతులు సేవలు పొందుతున్నారు. ఆర్బీకేల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. 18.31కోట్లను ఖర్చు చేసింది.

ఆర్‌బీకేలు ఎంతో ఉపయోగకరం



రైతు భరోసా కేంద్రాల వల్ల మా లాంటి రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. గతంలో సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లతోపాటు సాగుకు సంబంధించిన ఏ అవసరమున్నా మండల కేంద్రంలోని ఏఓ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఊళ్లోనే ఆర్‌బీకేలలో అన్నీ పనులు పూర్తి చేసుకుంటున్నాం. –తిరుమల రెడ్డి, పిచ్చాటూరు గ్రామం

ప్రభుత్వ పథకాలు భేష్



రైతుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, సున్నా వడ్డీకే రుణాలు, గిట్టుబాటు ధరల కల్పన వంటి పథకాలు రైతులకు ఆసరాగా ఉన్నాయి. ఈ పథకాల ద్వారా ఇప్పటికే రైతులు లబ్ధి పొందుతుండడం వల్ల పంట సాగుకు ఉత్సాహంగా ఉంది. మా లాంటి రైతులు మళ్లీ సాగుకు సమాయత్తమవుతున్నాం.

–రమేష్, రైతు, అప్పులరాజు కండ్రిగ

త్వరితగతిన పరిష్కారం



రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్నదాతల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం లభిస్తోంది. గతంలో రైతులు వారి సమస్యల పరిష్కారానికి మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. గ్రామసభలను ఏర్పాటు చేసి ప్రభుత్వం చేపడుతున్న వ్యవసాయ పథకాలను రైతులకు వివరిస్తున్నాం. –టి. సుబ్రమణ్యం, ఏడీఏ, సత్యవేడు

ఎంతో ఉపయోగకరం



రైతు భరోసా కేంద్రాలతో సౌకర్యంగా ఉంది. రైతులకు అవసరమైన సలహాలను అందిస్తూ సమస్యలను సైతం తక్కువ సమయంలోనే పరిష్కరిస్తున్నారు. పంటల సాగు అంశంలో తగు సూచనలను ఇస్తున్నారు. గతంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదు. రైతుల సంక్షేమానికి ప్రస్తుత ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. నాలుగు విడతలుగా రైతు భరోసా నగదు అందుకున్నాను.

–రవి, చిన్న పాండూరు

చెంతకే ఎరువులు



గతంలో ఎరువులు తెచ్చుకోవాలంటే వరదయ్యపాళెం మండల కేంద్రానికి వెళ్లి ఎన్నో వ్యయప్రయాసలకు గురి అవాల్సి వచ్చేది. అయితే ప్రస్తుతం రైతు భరోసా కేంద్రాల వద్దకే ఎరువులను అందుబాటులోకి తేవడం ఎంతో బాగుంది. శాస్త్రవేత్తలు సైతం తరచూ వచ్చి తగిన సూచనలు, సలహాలు ఇస్తున్నారు. జగనన్న ప్రభుత్వంలో వ్యవసాయం లాభసాటిగా మారింది.

–సుధాకర్, వెంగారెడ్డికండ్రిగ

పడిగాపుల నుంచి విముక్తి



గత ప్రభుత్వ హయాంలో పచ్చిరొట్ట విత్తనాల కోసం ముందుగా టోకన్లు పొంది మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం వద్ద క్యూలో నిలబడి విత్తనాలు తీసుకునేవాళ్లం. దీని వల్ల సీజన్ కూడా దాటిపోయేది. అయితే ప్రస్తుత ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన రైతు భరోసా కేంద్రాల వల్ల గ్రామస్థాయిలోనే విత్తనాలు, ఎరువులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సీజన్‌కు పొందుతున్నాం. వ్యవసాయం సైతం సులభతరంగా మారింది.

–వినోద్, పెద్ద పాండూరు

ఐఐటీ టెక్నాలజీతో రోడ్ల నిర్మాణం

తిరుపతి మంగళం : దేశంలోనే తొలి సారిగా తిరుపతిలో ఐఐటీ టెక్నాలజీని వినియోగించుకుని సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు నగర డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక 6వ డివిజన్‌లో నిర్మిస్తున్న రోడ్డును ఆయన పరిశీలించారు. అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో సీసీ రోడ్లపై వర్షపునీరు వృథాగా కాలువల్లోకి వెళ్లిపోయేదని, దాంతో భూగర్భజలాలు అడుగంటిపోయేవన్నారు. ప్రస్తుతం అలాంటి సమస్య తలెత్తకుండా భావితరాలు భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రోడ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. ఐఐటీ టెక్నాలజీ రోడ్లతో ఎంతటి వర్షం కురిసినా ఆ నీరు పక్కకు పోకుండా అక్కడే భూమిలోకి ఇంకిపోతుందని వివరించారు. దీంతో భూగర్భజల మట్టం పెరిగే అవకాశముంటుందని వెల్లడించారు. తద్వారా బోర్లలో పుష్కలంగా నీరు వస్తుందన్నారు. భవిష్యత్‌లో కూడా నీటి సమస్య తలెత్తదని స్పష్టం చేశారు. అందుకే తిరుపతి నగరంలోని ప్రతి కాలనీలో ఇలాంటి రోడ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో టౌన్‌బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, కార్పొరేటర్ మునిరామిరెడ్డి, పార్టీ 6వ వార్డు అధ్యక్షుడు నాదమునిరెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, జగదీష్ యాదవ్ పాల్గొన్నారు.



రోడ్డును పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

రెజ్లింగ్ చాంపియన్లకు అభినందన



క్రీడాకారులతో రెజ్లింగ్ సంఘం సభ్యులు

నాయుడుపేట : రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులకు జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ వారు అభినందనలు తెలిపారు. శనివారం నాయుడుపేట జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో రెజ్లింగ్ కోచ్ బి.ఉదయ్ కుమార్ మాట్లాడుతూ డిసెంబర్ 24, 25 తేదీల్లో కాకినాడలో నిర్వహించిన పోటీల్లో జిల్లా జట్టు ఉత్తమంగా రాణించి ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకుందన్నారు. మొత్తం 3 బంగారు, 5 రజతం, 4 కాంస్య పతకాలు సాధించినట్లు వివరించారు. త్వరలోనే ఉత్తర ప్రదేశ్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీల్లో జిల్లా జట్టు పాల్గొననున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రెజ్లింగ్ జిల్లా అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ రవిరెడ్డి, కార్యదర్శి దారా రవి, పీడీ హరినారాయణ, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ మల్లికార్జునరావు, పీఈటీ భాస్కర్ పాల్గొన్నారు.